
సాక్షి
గుంటూరు

సోమవారం । 9 । డిసెంబర్ । 2024



పైడమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

భట్టిప్రోలు :ఐలవరం గ్రామ దేవత పైడమ్మ తల్లికి ఆదివారం మాచర్ల వంశీయులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి సన్నిధిలో మొక్కుబడులు చెల్లించుకున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ నీటి మట్టం ఆదివారం 584.80 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకు 8,144 క్యూసెక్కులు వదిలారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



రేపల్లె రూరల్: బందలగరువు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీరామ మందిరంలో సీతారామ లక్ష్మణ హనుమాన్ విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

కాలభైరవాష్టమి పూజలు



అమరావతి: పంచారామక్షేత్రం అమరేశ్వరాలయంలో కాలభైరవాష్టమి సందర్భంగా ఆదివారం కాలభైరవస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల సమక్షంలో అర్చకులు కైతేపల్లి సుధీర్‌శర్మ ఆధ్వర్యంలో మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఉదయం ఏడు గంటలకు అర్చకులు అభిషేకాలను నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమరేశ్వరాలయానికి చేరుకుని రెండో ప్రాకారంలో ఉన్న కాలభైరవస్వామికి పూజలు నిర్వహించిన అనంతరం అమరేశ్వరుడిని దర్శించుకుని పూజలు చేశారు. కాలభైరవాష్టమి ప్రత్యేక పూజలలో పలు గ్రామాల నుంచి తరలి వచ్చిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

నరసరావుపేట ఈస్ట్: జాతీయ ఉపకార వేతన పరీక్ష పల్నాడు జిల్లాలో ఆదివారం ప్రశాంతంగా నిర్వహించినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. పల్నాడు జిల్లా పరిధిలో 14 పరీక్ష కేంద్రాలలో 2,745 మంది విద్యార్థులు పరీక్ష రాసేందుకు నమోదు చేసుకోగా 2,589 మంది హాజరయ్యారని, 156 మంది గైర్హాజరయ్యారని వివరించారు. నరసరావుపేట డివిజన్ పరిధిలో ఐదు, సత్తెనపల్లి పరిధిలో నాలుగు, గురజాల డివిజన్ పరిధిలో ఐదు కేంద్రాలలో పరీక్ష నిర్వహించినట్టు వెల్లడించారు. డీఈఓ ఆదివారం కేంద్రాలను సందర్శించి పరీక్ష నిర్వహణను పరిశీలించి నిర్వాహకులకు సూచనలు ఇచ్చారు. పరీక్షల ప్రాథమిక కీ 9న సోమవారం విడుదల చేస్తారని, www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంచుతారని పేర్కొన్నారు. ప్రాథమిక కీపై అభ్యంతరాలు ఉంటే ఈనెల 16న సాయంత్రం 5 గంటల వరకు వెబ్‌సైట్‌లోని గ్రీవెన్స్ లింక్ ద్వారా స్వీకరిస్తారని వివరించారు. పరీక్ష కేంద్రాలను సందర్శించిన వారిలో జిల్లా ప్రభుత్వ పరీక్షల అధికారి కె.ఎం.ఎ.హుస్సేన్ ఉన్నారు.

భక్తులతో పోటెత్తిన తిరుపతమ్మవారి ఆలయం



పెనుగంచిప్రోలు: తిరుపతమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. సెలవు దినం కావటంతో పాటు పలు శుభకార్యాలు ఉండటంతో భక్తులు విశేషంగా తరలివచ్చారు. అమ్మవారిని దర్శించి తరించటంతో పాటు పాలు, పొంగళ్లతో బోనాలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. హోమశాలలో వేద పండితులు చండీహోమం నిర్వహించారు. ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఈవో భూపతిరాజు వెంకట సత్య నాగకిషోర్‌కుమార్, ఏఈఓ తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

కార్తికేయుని ఆలయంలో మహా పూర్ణాహుతి



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలో శ్రీసుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం మహాపూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ డీసీ దాసరి శ్రీరామవరప్రసాదరావు ఆధ్వర్యంలో వేద పండితుడు కొమ్మూరు ఫణికుమార్ శర్మ, ఆలయ ప్రధానార్చకులు బుద్ధు పవన్‌కుమార్ శర్మ, ఘనాపాటి నౌడూరి సుబ్రహ్మణ్యశర్మ బ్రహ్మత్వంలో ఉదయం 6 గంటలకు ప్రాతఃకాలార్చణలు, గోపూజ, నిత్యహోమం, బలిహరణ, పంచామృతస్నపన, వసంతోత్సవం అనంతరం మహా పూర్ణాహుతి, తీర్థప్రసాద వినియోగం చేశారు. శేషవాహనంపై స్వామివారిని రావివారిపాలెం వరకు గ్రామోత్సవం నిర్వహించారు.

11న కానుకల లెక్కింపు..

మోపిదేవి శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలో భక్తులు హుండీలో సమర్పించిన కానుకుల లెక్కింపు ఈ నెల 11వ తేదీ ఉదయం ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఆలయ డీసీ దాసరి శ్రీరామవరప్రసాదరావు ఆదివారం తెలిపారు.

ముదిరిన మామూళ్ల రోగం!

- ఆసుపత్రుల రిజిస్ట్రేషన్, రెన్యూవల్‌కు మామూళ్లు
- ఒక్కో బెడ్‌కు రేటు నిర్ణయించి మరీ వసూలు
- కాంట్రాక్ట్, కింది స్థాయి ఉద్యోగులదే కీలక పాత్ర
- డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో నిత్యం ఇదే తంతు
- గగ్గోలు పెడుతున్న ఆసుపత్రుల నిర్వాహకులు

ఆసుపత్రులకు, ల్యాబ్‌లకు రిజిస్ట్రేషన్, రెన్యూవల్ కోసం వెళ్తే డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో భారీ స్థాయిలో మామూళ్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ఈ మేరకు ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు, సిబ్బంది ఆరోపిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక్కో బెడ్‌కు రూ. వెయ్యి చొప్పున తీసుకుంటున్నారు. క్లినిక్‌లకు, ఆసుపత్రులకు కనీస మామూళ్లు నిర్ణయించి మరీ వసూలు చేస్తున్నారని వాపోతున్నారు. కార్యాలయంలో పనిచేస్తున్న నాలుగో తరగతి, కాంట్రాక్టు ఉద్యోగుల ద్వారా ఈ వ్యవహారం నడుస్తోంది. ఆసుపత్రుల నిర్వాహకులను వారే పిలిపించి ముడుపులు చెల్లించిన వారికి తక్షణమే అనుమతులు మంజూరు చేస్తున్నారు.

గుంటూరు మెడికల్ : ఏపీ అల్లోపతిక్ మెడికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ రిజిస్ట్రేషన్ యాక్ట్ 2007, ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాలో ఆసుపత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు, ఎక్స్‌రే యూనిట్ల నిర్వాహకులు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో రిజిస్ట్రేషను చేయించుకోవాలి. ఐదేళ్ల అనంతరం రెన్యూవల్ తప్పనిసరి. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది. రిజిస్ట్రేషను, రెన్యూవల్ కోసం రోజూ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు, ఎక్స్‌రే ల్యాబ్‌ల నిర్వాహకులు డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి వస్తుంటారు. రిజిస్ట్రేషన్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయించుకున్న వారు ఆ వివరాలను డీఎంహెచ్‌ఓ కార్యాలయం వెబ్‌సైట్‌కు ఆన్‌లైన్ ద్వారా పంపాలి. ఓ సెట్ జిరాక్స్ కాపీలను కూడా డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో అందజేయాలి. అనంతరం



డీఎంహెచ్‌ఓ కార్యాలయం

ఆయా ఆసుపత్రులకు, ల్యాబ్‌లకు డీఎంహెచ్‌ఓ, కార్యాలయ ఉద్యోగులు తనిఖీలకు వెళ్లాలి. చట్ట ప్రకారం వైద్యులు, వైద్య సిబ్బంది, పరికరాలు, సౌకర్యాలు ఉన్నాయా? అని పరిశీలించాల్సి ఉంటుంది. ఉంటే రిజిస్ట్రేషన్ చేసి సంబంధిత పత్రం అందజేస్తారు. సదరు రిజిస్ట్రేషన్ కాపీని ఆసుపత్రుల నిర్వాహకులు ప్రాంగణంలో అందరికీ కనిపించే ప్రదేశంలో ప్రదర్శించాలి.

తాత్కాలిక ఉద్యోగులదే హవా

డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో రిజిస్ట్రేషన్, రెన్యూవల్ కోసం జనరల్ సెక్షన్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్ విధులు నిర్వహించేవారు. జిల్లాల విభజన తర్వాత ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగంలో వారు ఈ విధులు చేపట్టారు. సుమారు ఆరు నెలలుగా సీనియర్ అసిస్టెంట్ లేకుండానే కార్యాలయంలో పనిచేస్తున్న కాంట్రాక్టు, నాలుగో తరగతి ఉద్యోగులే ఈ విధులు నిర్వహించడంపై కార్యాలయ ఉద్యోగులు సైతం మండిపడుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక్కో బెడ్‌కు రూ. వెయ్యి చొప్పున ఆసుపత్రిలో ఎన్ని పడకలు ఉంటే అంత మొత్తం ముక్కు పిండి మరీ వసూలు చేస్తున్నారు. దీంతో ప్రైవేటు ఆసుపత్రులు, ల్యాబ్‌ల నిర్వాహకులు బెంబేలెత్తుతున్నారు. ఆసుపత్రులు, క్లినిక్‌లకు కనీసం రూ. 30 వేల నుంచి రూ. 50 వేల వరకు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. ఎక్కువ పడకలు ఉంటే రూ. 70 వేల నుంచి రూ. లక్ష వరకు చెల్లించాలని కూడా రూల్స్ పెట్టినట్లు పలువురు విమర్శిస్తున్నారు. కింది స్థాయి, కాంట్రాక్టు ఉద్యోగులను కలిసిన వారికి వెంటనే అనుమతులు ఇస్తున్నారని చెబుతున్నారు.

గతంలో ఏసీబీకి ఫిర్యాదులు

గతంలో ఇదే తరహాలో అధిక మొత్తంలో మమూళ్ల వసూలు చేయడంతో ఏసీబీ అధికారులకు సైతం ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో సదరు సిబ్బందిపై క్రమశిక్షణ రాహిత్యం కింద ఉన్నతాధికారులు చర్యలు సైతం తీసుకున్నారు. మళ్లీ ఇప్పుడు దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. నిబంధనల ప్రకారం ఆసుపత్రులపై ఏమైనా చర్యలు తీసుకోవాలంటే కార్యాలయ ఉద్యోగులు నోట్‌ఫైల్ సిద్ధం చేస్తారు. ఇలా ఎలాంటి నోట్‌ఫైల్స్ లేకుండానే రెన్యూవల్, రిజిస్ట్రేషన్ కొనసాగిస్తున్నారు. జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కొన్నిచోట్ల అనుమతులు లేకుండానే వైద్యం

జిల్లాలో ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు దాదాపు 800 వరకు ఉన్నాయి. కొన్ని ఆసుపత్రులు, ల్యాబ్‌లు మాత్రం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఇప్పటికీ ఎలాంటి రిజిస్ట్రేషన్ చేయించుకోలేదు. కొంత మంది చేయించుకున్నా రెన్యూవల్ లేకుండా చికిత్సలు అందిస్తున్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు తరచూ ఆసుపత్రులను తనిఖీలు చేయాలి. నిబంధనలు పాటించని వారికి షోకాజ్ నోటీ**సులు జారీ చేయాల్సి ఉంటుంది. కొన్ని సం**దర్భాల్లో సీజ్ కూడా చేస్తారు. కానీ ఇలా తనిఖీల ఊసే రాకుండా ఉండాలంటే.. తమ వద్దకు వచ్చి మామూళ్లు ఇచ్చుకున్నవారికి తాత్కాలిక ఉద్యోగులు భరోసా ఇచ్చి రిజిస్ట్రేషన్, రెన్యూవల్ చేస్తున్నారు. దీంతో చాలామంది ఆసుపత్రుల నిర్వాహకులు ఎలాంటి భయం లేకుండా యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఫిర్యాదు చేస్తే చర్యలు



డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఆసుపత్రుల రిజిస్ట్రేషను, రెన్యూవల్ కోసం ఎవరైనా మామూళ్లు అడిగితే మా దృష్టికి తీసుకొస్తే వారిపై చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఫీజులు ఆన్‌లైన్‌లో చెల్లిస్తే సరిపోతుందని పేర్కొన్నారు. ఎవరైనా ఇలాంటి ఆరోపణలతో ఫిర్యాదు చేస్తే బాధ్యులపై చర్యలు తప్పవని చెప్పారు.

–డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, డీఎంహెచ్‌ఓ

గెలుపే లక్ష్యం కావాలి



మాట్లాడుతున్న డాక్టర్ జీపీ రాజు

నరసరావుపేట రూరల్: జేఎన్‌టీయూకే సెంట్రల్‌జోన్ అంతర కళాశాలల పురుషుల వాలీబాల్ పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ప్రారంభమైన పోటీలలో జేఎన్‌టీయూ కాకినాడ పరిధిలోని ఐదు జిల్లాల నుంచి 38 జట్లు పాల్గొన్నాయి. దాదాపు 450 మంది క్రీడాకారులు పాలుపంచుకుంటున్నారు. కళాశాల ప్రాంగణంలోని నాలుగు వాలీబాల్ కోర్టుల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. రెండు రోజుల పాటు పోటీలు జరగనున్నాయి. రాత్రి వేళల్లోనూ పోటీల నిర్వహణకు ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేశారు. పోటీల అనంతరం సత్తా చాటిన క్రీడాకారులతో జేఎన్‌టీయూకే వాలీబాల్ జట్టును ఎంపిక చేయనున్నారు. పోటీల నిర్వహణను జేఎన్‌టీయూకే ఐసీటీ కార్యదర్శి డాక్టర్ జీపీ రాజు పర్యవేక్షిస్తున్నారు. సెలెక్షన్ కమిటీ సభ్యులుగా డాక్టర్ ఎ.రామచంద్రరాజు, కె.వెంకట్రావు వ్యవహరిస్తున్నారు.

అట్టహాసంగా ప్రారంభోత్సవం

ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జేఎన్‌టీయూకే ఐసీటీ సెక్రటరీ డాక్టర్ జీపీ రాజు, ఎన్ఈసీ కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు హాజరయ్యారు. డాక్టర్ జీపీ రాజు మాట్లాడుతూ జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో రూ.16 కోట్లతో నిర్మిస్తున్న స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏడాదిన్నరలో అందుబాటులోకి వస్తుందన్నారు. సౌత్ జోన్, ఆల్ ఇండియా అంతర వర్సిటీల పోటీలు నిర్వహించేందుకు వీలుగా ఈ నిర్మాణం జరుగుతోందని వివరించారు. వాలీబాల్ క్రీడకు నరసరావుపేట ప్రసిద్ధి అని చెప్పారు. కళాశాల చైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆటలైనా, జీవితమైనా గెలుపే లక్ష్యం కావాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌బాబు, వ్యాయామ అధ్యాపకులు లక్కు కృష్ణారెడ్డి, ఆంజనేయులు, విజయకుమార్, ఏవో శ్రీధర్ పాల్గొన్నారు.

నల్లచెరువులో కార్డన్ సెర్చ్

- తెల్లవారుజాము నుంచే ఆ ప్రాంతాన్ని జల్లెడ పట్టిన పోలీసులు
- స్వయంగా పాల్గొన్న జిల్లా ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్

పట్నంబజారు: గుంటూరు నగరంలోని లాలాపేట పోలీసుస్టేషన్ పరిధిలో ఆదివారం జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ నేతృత్వంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. తెల్లవారుజామున ఐదు గంటల నుంచే ఆ ప్రాంతాన్ని పోలీసులు జల్లెడ పట్టారు. పాత నేరస్తులు, రౌడీషీటర్లు, అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తుల నివాసాల్లో తనిఖీలు చేశారు. వారి వివరాలను సాంకేతిక పరిజ్ఞానం ద్వారా తెలుసుకున్నారు. త్రినేత్ర సహాయంతో వాహనాల వివరాలు తనిఖీ చేశారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తనిఖీల్లో స్వయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆకస్మిక తనిఖీలతో అసాంఘిక శక్తుల ఆగడాలకు అడ్డుకట్ట వేస్తున్నట్లు చెప్పారు. మొబైల్ స్కానింగ్ ద్వారా అనుమానాస్పద వ్యక్తులకు సంబంధించి వేలిముద్రలను పరిశీలించినట్లు తెలిపారు. జిల్లాలోని అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతామని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు ఇలాంటి ఆకస్మిక తనిఖీలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. కార్డన్ సెర్చ్‌లో భాగంగా 70 మంది రౌడీషీటర్లు, గంజాయి కేసుల్లో ఉన్న నిందితులు, పలువురు అనుమానితుల వేలిముద్రలను సేకరించారు. సుమారు 300 వాహనాలను తనిఖీ చేసి, పత్రాలు లేని 77 ద్విచక్ర వాహనాలు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో 22 వాహనాలకు సంబంధించి వాహనదారులు ఇచ్చిన వివరాలు భిన్నంగా ఉన్నట్లు గుర్తించి, వారిపై ఆరా తీస్తున్నారు. సరైన పత్రాలు అందజేస్తే ఆయా వాహనాలను తిరిగి అప్పగిస్తామని పేర్కొన్నారు. తనిఖీల్లో ఏఎస్పీ కె.సుప్రజ, డీఎస్పీలు షేక్ అబ్దుల్ అజీజ్, జయరాంప్రసాద్, శివాజీ, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



తనిఖీల్లో పాల్గొన్న ఎస్పీ సతీష్‌కుమార్, అధికారులు, సిబ్బంది

అధికార 'పచ్చ'మే!

- వివాదాస్పదంగా నగరపాలక సంస్థ అధికారుల వైఖరి
- ప్రొటోకాల్ పాటించకుండానే పలు అభివృద్ధి కార్యక్రమాలు
- ఏకంగా మేయర్‌నే ఆహ్వానించని దుస్థితిలో యంత్రాంగం
- నగర ప్రథమ పౌరుడి పేరును శిలాఫలకంలో మూలన వేసిన వైనం
- కూటమి నేతల మెప్పు కోసం వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లకు అవమానాలు

నెహ్రూనగర్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నగరపాలక సంస్థ అధికారులు సంబంధిత పార్టీల నేతల మెప్పు కోసం సాగిలపడుతున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో తప్పనిసరిగా స్థానిక ప్రజాప్రతినిధులను ప్రొటోకాల్ ప్రకారం పిలవాలి. కానీ వారికి ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారు. ఇదంతా 'పచ్చ' నేతల సేవలో తరించేందుకు పడుతున్న తాపత్రయంగా స్పష్టమవుతోంది.

పాఠశాల సమావేశాలలో...

అధికారుల 'పచ్చ'పాతానికి నిదర్శనం శనివారం జరిగిన పేరెంట్స్ – టీచర్స్ మీటింగులలో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్‌ను పిలిచి అవమానించడమే. మరికొన్ని చోట్ల ఆ పార్టీ కార్పొరేటర్లను పిలవకుండానే కార్యక్రమాలను నిర్వహించిన ఉదంతాలు కూడా ఉన్నాయి. తాజాగా ఆదివారం 47వ డివిజన్ గోరంట్ల పరిధిలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసే కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ అధికారులు చేపట్టారు. దీనికి నగర ప్రథమ పౌరుడైన మేయర్ కావటి మనోహర్ నాయుడును కూడా ఆహ్వానించలేదు. పైగా ఆయన పేరును ఎక్కడో ఒక మూలన.. ఏదో వేయాలి కదా అన్నట్లుగా శిలాఫలకంలో వేశారు. వాస్తవానికి మేయర్ పేరును సభాధ్యక్షులుగా వేయాల్సి ఉంది. ఇటీవల వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లకు ముందస్తు సమాచారం లేకుండానే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మేయర్‌ను కూడా పక్కన పెట్టి కూటమి నాయకుల మెప్పు కోసం అధికారులు ప్రయత్నించడం సిగ్గుచేటని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ విషయాన్ని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు దృష్టికి నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు తీసుకువెళ్లినట్లు సమాచారం. వ్యక్తిగత పని మీద శంకుస్థాపన కార్యక్రమానికి హాజరు కాలేకపోయానని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని చెప్పినట్లు తెలిసింది.



మేయర్ పేరు ప్రాధాన్యత తగ్గించి వేసిన దృశ్యం

డొంక తిరుగుడు వేధింపులు

- రోడ్డు అభివృద్ధి పేరుతో దళితులపై కక్ష సాధింపు
- వారు వ్యవసాయం చేసే భూమిలో కాలువలా తవ్వకం
- ఇకపై సాగుకు పనికిరాకుండా చేయడమే లక్ష్యం
- వైఎస్సార్ సీపీకి మద్దతు ఇచ్చారనే దుర్మార్గపు చర్యలు
- ఆవేదనలో దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న దళితులు

తెనాలి: తెనాలి రూరల్ మండలంలోని గుడివాడ గ్రామంలో దళితులు దశాబ్దాలుగా సాగు చేస్తున్న డొంక భూమిని పంచాయతీ పాలకులు తవ్వించేశారు. పొలంలో సాగు పనులేవీ చేసుకునేందుకు వీల్లేకుండా పొలం వెంబడి జేసీబీతో ఈ తవ్వకాలు జరిపించారు. పంట కాలువను తలపిస్తున్న ఈ గోతిని చూసి తమకు అన్యాయం చేశారంటూ దళితులు ఆవేదన చెందుతున్నారు. గత ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా తాము నిలిచామనే కక్షతోనే ఈ చర్యకు పాల్పడ్డారని ఆరోపిస్తున్నారు.

తాత్కాలిక పట్టాలున్నా..

గుడివాడ – కోపల్లె మధ్య డొంకరోడ్డు పక్కన భూములను ఆ రెండు గ్రామాలకు చెందిన ఎస్సీలు దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్నారు. వీరిలో గుడివాడకు చెందిన అయిదుగురు దాదాపు మూడెకరాల భూమిలో సాగు చేస్తున్నారు. 1974లో అప్పటి అధికారులు తాత్కాలిక పట్టాలు కూడా ఇచ్చారు. ఆ భూములు ఎవరి ఆధీనంలో ఉన్నాయో వారికే సాగు హక్కు కల్పిస్తూ వీటిని అందించారు. లబ్ధిదారులు అప్పట్నుంచి ప్రభుత్వానికి తహసీలు చెల్లిస్తూ వచ్చారు. 2012 తర్వాత నుంచి అధికారులే పన్ను వసూలు చేయటం లేదు. ప్రస్తుతం ఎప్పటిలాగే ఖరీఫ్ సీజనులో వరి సాగు చేశారు. గత నెల 30వ తేదీన హఠాత్తుగా ముగ్గురు వచ్చారు. దాదాపు 1.20 ఎకరాల భూమి వెంబడి భారీ గోతిని తీశారు. జేసీబీతో పెద్ద పంట కాలువను తలపించే రీతిలో మట్టిని తీసి, డొంక రోడ్డులో సర్దేశారు. పంట పొలంలో మట్టి పోశారు. అదేమంటే డొంక రోడ్డు విస్తరణకు పంచాయతీలో తీర్మానం చేశామని, అందులో భాగంగానే మట్టిని తీశామని చెబుతున్నారు. భూమి స్వాధీనంలో ఉన్న రైతులకు ముందస్తు సమాచారం కూడా సంబంధిత అధికారులు ఇవ్వలేదు. గత పంచాయతీ ఎన్నికల్లో గుడివాడ సర్పంచ్‌గా యడ్లపాటి రాకేష్ ఎన్నికయ్యారు. ఇన్నేళ్లుగా డొంకరోడ్డు విస్తరణ ఆ పాలకవర్గానికి పట్టలేదని... రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో ఆ విషయం గుర్తొచ్చిందా? అని బాధితులు ప్రశ్నిస్తున్నారు. డొంక రోడ్డు భూములను సాగు చేసే రైతులు గత ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలికారనే కక్ష సాధింపుతోనే వ్యవసాయానికి పనికి రాకుండా తమ భూమి ఇలా తవ్వేశారని రుద్రపాటి నాగేశ్వరరావు ఆరోపించారు. దీనిపై మండల తహసీల్దారుకు కూడా విన్నవించామని చెప్పారు. తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.



దళితుల సాగు భూమిని తవ్విస్తున్న దృశ్యం



డొంక భూమిలో పోసిన తవ్వేసిన మట్టి

అన్యాయం జరగనివ్వను

డొంక అంచున పొలం తవ్విన విషయం తెలియగానే ఫోను చేసి పనులు ఆపించేశా. తర్వాతి రోజు అక్కడికెళ్లి పరిశీలించా. డొంక రోడ్డు విస్తరణ కోసం రైతులు కోరిన తర్వాతే పనులు చేపట్టినట్టు పంచాయతీ వారు చెబుతున్నారు. ఒకటి, రెండు రోజుల్లో తగిన నిర్ణయం తీసుకుంటా. దళితులకు అన్యాయం జరగకుండా చూస్తాను.

– కేవీ గోపాలకృష్ణ, తహసీల్దార్, తెనాలి మండలం

మహిళ ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

- గండ్లూరు సమీపంలోని పంట పొలాల్లో దారుణం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన పట్టణ పోలీసులు
- రాజుపాలెం పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయిన నిందితుడు

సత్తెనపల్లి: వివాహేతర సంబంధం కారణంగా ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. ఈ ఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి శివారులో ఆదివారం తెల్లవారుజామున వెలుగు చూసింది. పట్టణంలోని రంగా కాలనీకి చెందిన రమాదేవి (42), రాజుపాలెం మండలం కొత్తూరు గ్రామానికి చెందిన గోసుల వెంకట్రావుకు ఇరవై సంవత్సరాల నుంచి వివాహేతర సంబంధం ఉంది. రమాదేవికి వివాహమై భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరు వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం వెళ్లదీస్తున్నారు. గోసుల వెంకట్రావుకు కూడా ఇప్పటికే వివాహమై భార్య, పిల్లలు ఉన్నారు. కొంత కాలంగా రమాదేవి సోదరి పక్షవాతంతో మంచం పట్టింది. ఈ క్రమంలో ఆమెకు రమాదేవి సహాయకురాలిగా ఉంటోంది. ఇటీవల ఆమె సోదరి మృతి చెందింది. ఆమె భర్తతో రమాదేవి చనువుగా ఉంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ప్రియుడు గోసుల వెంకట్రావు ఆమెపై అనుమానం పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో.. వివాహేతర సంబంధానికి స్వస్తి పలుకుదామని, బ్యాంకులో కుదువ పెట్టిన తన మూడు సవర్ల బంగారం విడిపించాలని రమాదేవి అతడిపై ఒత్తిడి తెస్తోంది. దీంతో ఆమెను హతమార్చాలని వెంకట్రావు నిర్ణయించుకున్నాడు. రాజుపాలెం మండలం రెడ్డిగూడెంలో మాట్లాడుకుందామని రమాదేవికి శనివారం వెంకట్రావు చెప్పాడు. రెడ్డిగూడెంలో మద్యం తాగుతూ చాలా సేపు రమాదేవికి నచ్చచెప్పే యత్నం చేశాడు. అయినా ఆమె మాట వినలేదు. దీంతో రమాదేవిని ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని సత్తెనపల్లి మండలం గండ్లూరు సమీపంలోని పెట్రోల్ బంకు దాటాక పంట పొలాల వద్దకు శనివారం రాత్రి తీసుకెళ్లాడు. అక్కడ కూడా ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో కోపోద్రిక్తుడైన వెంకట్రావు.. ఆమె మెడకు చీర కొంగును బలంగా బిగించి హతమార్చి పరారయ్యాడు. ఆదివారం ఉదయం మహిళ మృతదేహాన్ని చూసిన రైతులు పోలీసులకు సమాచారం అందించారు. ఆ మేరకు ఘటనా స్థలాన్ని సత్తెనపల్లి టౌన్ సీఐ బ్రహ్మయ్య, ఎస్ఐ ఎం.సంధ్యారాణి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రాజుపాలెం పోలీస్‌స్టేషన్‌లో నిందితుడు గోసుల వెంకట్రావు లొంగిపోయినట్లు తెలిసింది. ఈ హత్య తానే చేశానని అతడు అంగీకరించినట్లు సమాచారం.



రమాదేవి మృతదేహం

క్లుప్తంగా

సీఆర్డీఏ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు లంచం డిమాండ్

కంప్యూటర్ ఆపరేటర్‌పై స్టేషన్‌లో ఫిర్యాదు

తాడికొండ: ఏపీసీఆర్డీఏలో ప్లాట్లు రిజిస్ట్రేషన్‌కు రూ.50 వేలు లంచం అడిగిన కంప్యూటర్ ఆపరేటర్‌పై తుళ్ళూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఏపీసీఆర్డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మీడియాలో సంబంధిత ఆడియో ప్రసారం కావడంతో విచారణ జరిపామన్నారు. సంబంధిత ఉద్యోగి జొన్నకూటి అశోక్ అబ్బరాజుపాలెం, బోరుపాలెం భూ సమీకరణ కేంద్రం–2లో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. రైతు భోగినేని సుధీర్‌తో మాట్లాడుతూ రూ.50 వేలు లంచం డిమాండ్ చేసిన ఆడియో క్లిప్ ఆధారంగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఆయనపై చర్యల నిమిత్తం ఏసీబీ డైరెక్టర్ జనరల్ కార్యాలయం, విధుల నుంచి తొలగింపునకు సంబంధిత ఆధీకృత అధికారికి లేఖలు పంపినట్లు పేర్కొన్నారు.

ప్రజల ఓటింగ్‌కు అవకాశం పొడిగింపు

తాడికొండ: ఏపీసీఆర్డీఏ ప్రాజెక్టు ఆఫీస్ డిజైన్‌పై ప్రజల ఓటింగ్ గడువు పొడిగించినట్లు కమిషనర్ కాటమనేని భాస్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆఫీస్ బిల్డింగ్ ఎలా ఉండాలనే దానిపై అధికారులు వెబ్‌సైట్ ద్వారా నవంబర్ 30 నుంచి డిసెంబర్ 6వ తేదీ వరకు ఆన్‌లైన్ పోలింగ్ నిర్వహించారు. ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని కమిషనర్ అన్నారు. మరింత మందిని భాగస్వాములను చేసేందుకు ఈ నెల 14వ తేదీ వరకు అవకాశం పొడిగించామని తెలిపారు.

దారితప్పిన మహిళ

కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు



చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: ఖాకీ గుండెల్లో కరుణ హృదయం ఉందని చాటుకున్న ఘటన చిలకలూరిపేట మండలంలో చోటుచేసుకుంది. సుదూర ప్రాంతానికి ప్రయాణిస్తున్న బస్సు నుంచి దిగి దారితప్పిన మహిళను పోలీసులు సురక్షితంగా ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాలు... తూర్పు గోదావరి జిల్లా గొల్లపాలేనికి చెందిన గోపిశెట్టి గోగులమ్మ, అనారోగ్యంతో కర్ణాటకలో ఉన్న తన సోదరుడిని చూసేందుకు బస్సులో వెళ్తోంది. ప్రయాణంలో నరసరావుపేట మీదుగా వెళ్తున్న బస్సు, కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఓ రోడ్డుపక్కన ఆపాడు. పొరబాటున బస్సు డ్రైవర్ గోగులమ్మను ఎక్కించుకోకుండానే వెళ్లిపోయాడు. చిలకలూరిపేట వైపు వెళ్లి ఉంటుందని భావించి నడుచుకుంటూ రూరల్ మండలంలోని కోమటినేనివారిపాలెం వచ్చింది. రాత్రి 11 గంటల సమయంలో ఒంటరి మహిళ కంగారుగా ఉండటాన్ని స్థానికులు గమనించారు. ఆమె నుంచి వివరాలు తెలుసుకుని 100కు డయల్ చేసి సమాచారం అందించారు. పరిస్థితిని అర్థం చేసుకున్న ఎస్‌ఐ అనిల్‌కుమార్ తక్షణమే స్పందించి ఆమెను చిలకలూరిపేట పట్టణంలోని సాయి వృద్ధుల ఆశ్రమానికి తీసుకొచ్చాడు. గోగులమ్మ ద్వారా తన గ్రామాన్ని కనుగొని అక్కడి పోలీసుల ద్వారా ఆమె కుటుంబ సభ్యుల ఫోన్ నంబర్‌ను సేకరించారు. దీంతో ఆదివారం గోగులమ్మ కుమారుడు వీరవెంకట సత్యనారాయణను చిలకలూరిపేటకు పిలిపించి తల్లిని క్షేమంగా అప్పగించారు. దీంతో గోగులమ్మ కుటుంబ సభ్యులతో పాటు పలువురు ఎస్‌ఐ అనిల్‌కుమార్‌ను అభినందించారు.

తెలుగు సినిమాలో బాజీకో అధ్యాయం

- సత్కార సభలో డాక్టర్ సాయిమాధవ్ బుర్రా ఆకాంక్ష
- ఆహూతులను అలరించిన ఘంటసాల 'స్వరాభిషేకం'



ఎస్‌కే బాజీని సత్కరించిన డాక్టర్ సాయిమాధవ్ బుర్రా తదితరులు

తెనాలి: 'బుల్లెట్ బండి' పాటతో తెలుగువారి అభిమానాన్ని పొందిన సంగీత దర్శకుడు ఎస్‌కే బాజీకి తెలుగు సినిమా పరిశ్రమలో ఒక అధ్యాయం ఉండాలని ఆకాంక్షిస్తున్నట్టు ప్రముఖ సినీ మాటల రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా అన్నారు. సినిమాలోని అన్ని శాఖల్లోనూ తెనాలి నుంచి ప్రవేశం ఉండాలని, అందుకు తగిన సామర్థ్యం కలిగిన కళాకారులు ఇక్కడ ఉన్నారని చెప్పారు. గంధర్వ గాయకుడు ఘంటసాల 103వ జయంతి సందర్భంగా ఘంటసాల అభిమాన సంఘం ఆదివారం సాయంత్రం స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో 'స్వరాభిషేకం' నిర్వహించింది. ఇదే వేదికపై తెనాలికి చెందిన సినీ సంగీత దర్శకుడు ఎస్‌కే బాజీని డాక్టర్ సాయి మాధవ్ బుర్రా చేతులమీదుగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఘంటసాల, ఎస్పీ బాలు వంటి సుప్రసిద్ధ గాయకులు తెలుగువారు కావటం అందరి అదృష్టంగా చెప్పారు. ఘంటసాల సమకాలీకులు ఎందరో ఉన్నా, ఒకానొక రోజుల్లో వారంతా ఘంటసాలను చూసి అసూయపడిన వారేనని చెప్పారు. ఎస్పీ బాలు నటుల గొంతును అనుకరిస్తే, ఘంటసాల మాత్రం ఏ పాత్రకయితే పాడుతున్నారో ఆ పాత్రను మాత్రమే అనుకరించేవారని చెప్పారు. ఈ విషయాన్ని తనకు ఎస్పీ బాలు స్వయంగా చెప్పినట్టు గుర్తు చేసుకున్నారు. సత్కార గ్రహీత ఎస్‌కే బాజీ మాట్లాడుతూ.. తనకు విద్యనేర్పిన గురువు పెద బాజీ అయితే, తెనాలి తన సంగీతానికి పునాది వేసిందని చెప్పారు. తొలినాళ్లలో ఇక్కడి వారు పాటల ఆల్బమ్స్ పనులు ఇచ్చి ప్రోత్సహించటం మరువలేనని చెప్పారు. తొలుత డాక్టర్ కె.పురుషోత్తమరావు, వారాహీ బజాజ్ అధినేత తటవర్తి శ్రీనివాసరావు, డాక్టర్ సాయి మాధవ్ బుర్రా జ్యోతి ప్రజ్వలన చేసి, ఘంటసాల చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. నృత్య గురువు ఎ.వెంకటలక్ష్మి శిష్యబృందం కూచిపూడి నృత్యాంశాలను ప్రదర్శించింది. విశిష్ట అతిథులు మండవ శ్రీనివాసరావు (ఒంగోలు), జొన్నలగడ్డ సోమయాజులు (చెన్నై), బి.శివరామకృష్ణగుప్తా (హైదరాబాద్), పురిగడ్డ రామచంద్రరావు (కూచినపూడి)లను సత్కరించారు. తదుపరి సైదా ఆర్కెస్ట్రా సహకారంతో ఘంటసాల స్వరపరిచి, గానం చేసిన పౌరాణిక, సాంఘిక, జానపద చిత్రాల్లోని పాటలను గాయనీగాయకులు ఆలపించి సభికులను రంజింపజేశారు. సంస్థ ప్రతినిధి పొన్నపల్లి గోపాలకృష్ణమూర్తి, కోశాధికారి పొన్నూరు పెదబసవయ్య, కార్యదర్శి జి.నాగసుధాకర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చదువు నేర్పిన గురువులను ఎప్పటికీ మర్చిపోలేను

- కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్
- రావిపాడులో అమలోద్భవిమాత ఉత్సవాలు



రావిపాడులో కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసానికి స్వాగతం పలుకుతున్న సంఘు పెద్దలు

నరసరావుపేట రూరల్: అమ్మను ఎలాగైతే మర్చిపోలేమో చదువు నేర్పిన గురువులను ఎప్పటికీ మర్చిపోలేనని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండలంలోని రావిపాడులోని అమలోద్భవి మాత ఉత్సవాల్లో ఆదివారం పాల్గొన్నారు. అమలోద్భవి మాతకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రావిపాడుతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ నేలపై ఆడుకున్నానని, అక్షరం దిద్ది, పుస్తకం పట్టి ఈ పాఠశాలలోనే చదువుకున్నానని తెలిపారు. పిల్లవాడు ఎదిగే క్రమంలో కొన్ని ఘటనలు ఎదురవుతాయని అవి ఎప్పటికీ గుర్తుండిపోతాయని పేర్కొన్నారు. అమెరికాలో వ్యాపారం నిర్వహిస్తున్నా, డాక్టర్‌గా సేవ చేస్తున్నా, రాజకీయ రంగంలో ప్రజాసేవ చేస్తున్నా ఉపాధ్యాయులు చిన్నతనంలో నాకు నేర్పిన క్రమశిక్షణ, విలువలే అందుకు మూలకారణమని కొనియాడారు. చిన్నతనంలో ఎంత పద్ధతిగా పెరిగితే ఎదిగాక సమాజానికి అంత విలువ ఇస్తాం అనేది గురువుల ద్వారా నేర్చుకున్నానని వివరించారు. మాకు చదువులు చెప్పేందుకు వారి కుటుంబాలను వదిలి ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు నాకు ఎప్పటికీ గుర్తుంటాయని తెలిపారు. ఇప్పుడిప్పుడే ఢిల్లీలో మంచి గుర్తింపు వస్తుందని, బుర్రిపాలెం, రావిపాడు, పల్నాడుతో పాటు ఉమ్మడి గుంటూరు జిల్లా గర్వంగా తలెత్తుకునేలా నా ప్రవర్తన, నడవడిక ఉంటాయని పేర్కొన్నారు. 2014లో ఈ ప్రాంతం నుంచి పోటీ చేయాలని అనుకున్నానని, 2024లో గుంటూరు నుంచి పోటీచేశానని తెలిపారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకు రాజకీయాల్లో మంచి అనుభవం ఉందని, సైలెంట్‌గా, పద్ధతిగా తన పని చేసుకుంటారని కితాబిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు పాల్గొన్నారు. రావిపాడుకు వచ్చే మార్గంలో నరసరావుపేటలోని తన చిన్ననాటి మిత్రులను కేంద్రమంత్రి డాక్టర్ చంద్రశేఖర్ కలసి కొంతసేపు ముచ్చటించారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



2కె పరుగును ప్రారంభిస్తున్న అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

బాపట్ల: చదువుతోపాటు క్రీడల్లో కూడా విద్యార్థులు రాణించాలని జిల్లా అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్ పేర్కొన్నారు. ఆదివారం బాపట్ల పట్టణంలోని విజయలక్ష్మీపురంలో గల రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో 2కె, 5కె రన్ పోటీలను నిర్వహించారు. అనంతరం బహుమతుల ప్రదానోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో అడిషనల్ ఎస్పీ పాల్గొన్నారు. శరీరానికి నడక, పరిగెత్తడం చాలా అవసరమని పేర్కొన్నారు. ఉదయం నిద్ర లేవగానే తల్లిదండ్రుల కాళ్లకు నమస్కరించాలన్నారు. పిల్లలకు ఈ సంస్కారాన్ని నేర్పించాలని కన్నవారికి సూచించారు. రామకృష్ణ సేవా సమితి నిర్వాహకులు చిరంజీవి, నటరాజు, సురేష్, సంతోష్, సేవకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



చుండూరు (వేమూరు): రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన రైస్ మిల్లుపై విజిలెన్స్ ఎస్పీ శ్రావణ కుమార్ ఆధ్వర్యంలో శనివారం అర్ధరాత్రి దాడులు చేశారు. వేమూరు నియోజకవర్గంలోని చుండూరు మండలం నడిగడ్డ వారి పాలెంలోని పద్మ రైస్ మిల్లులో 50 కేజీల చొప్పున ఉన్న 270 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. మిల్లు నిర్వాహకులపై చుండూరు పోలీసు స్టేషన్‌లో క్రిమినల్ నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ చంద్ర శేఖర్, తహసీల్దారు కార్యాలయం నుంచి డీటీ శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన మహిళ

- ఆమె బ్యాంకు ఖాతా నుంచి రూ.4 లక్షలు పలు దఫాలుగా స్వాహా
- ఆవేదన వ్యక్తం చేసిన బాధితురాలు

వేటపాలెం: సైబర్ నేరగాళ్లు మితిమీరిపోయారు. ఈ మధ్యన వారి నేరాలు ఎక్కువవుతుండటంతో బాధితులు పెరిగిపోతున్నారు. అందినకాడికి దోచుకొని బాధితులను తీరని నరక వేదనకు గురిచేస్తున్నారు. ఇదే తరహాలో గ్రామీణ మహిళ బ్యాంక్ అకౌంట్‌లో నుంచి రూ.4 లక్షలు నగదు కాజేశారు. మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వేటపాలెం ఎస్సై ఎం వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. కఠారివారిపాలెం మత్స్యకార గ్రామానికి చెందిన కాటంగారి అనిత గ్రామంలో చిన్న కిరాణా షాపు నడుపుతూ జీవనం సాగిస్తోంది. నవంబరు 24వ తేదీన వేటపాలెంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో తనకు ఉన్న బ్యాంకు ఖాతాలో ఉన్న నగదు డ్రా చేసుకోవడానికి వెళ్లింది. తన ఖాతాలో ఉండాల్సిన నగదులో రూ.4,00,500 నగదు ఆగస్టు 18వ తేదీ నుంచి సెప్టెంబర్ 23వ తేదీ వరకు అనేక పర్యాయాలు ఇతర వ్యక్తులకు ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ అయినట్లు బ్యాంకు సిబ్బంది తెలిపారు. దీంతో బాధిత మహిళ ఒక్కసారిగా కంగుతింది. తాను ఎవ్వరికి నగదు పంపించలేదని, తన నగదు ఎవరు తీసుకొన్నారో తెలపాలని బ్యాంకు అధికారులను కోరింది. దీనిపై తమకు ఎటువంటి సమాచారం లేదని బ్యాంకు వారు తెలిపారు. సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోవాలని సిబ్బంది ఆ మహిళకు సూచించారు. ఆమె సైబర్ క్రైం పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేసింది. ఇంతవరకు తనకు న్యాయం జరగలేదని వేటపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. తన అకౌంట్‌లో నగదు బదిలీ అయినట్లు మెసేజ్‌లు వచ్చినప్పటికీ అవి ఇంగ్లిషులో ఉండటం వల్ల తెలుసుకోలేక పోయానని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు.

కౌలు రైతు ఆత్మహత్య



రామకృష్ణ మృతదేహం

దాచేపల్లి: పంటల కోసం చేసిన అప్పులు తీర్చలేక కౌలురైతు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. పల్నాడు జిల్లా దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని నారాయణపురానికి చెందిన ముశ్యం రామకృష్ణ(47) ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి, మిరప పంటలు సాగు చేశాడు. పంటల పెట్టుబడి కోసం సుమారుగా రూ.10 లక్షలకు పైగా అప్పులు చేశాడు. ఆశించిన స్థాయిలో దిగుబడులు రాకపోవటంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. పంటల కోసం చేసిన అప్పులు తీర్చలేనేమోనని ఆవేదన చెందాడు. దీంతో తాను సాగు చేస్తున్న పొలంలోకి శనివారం సాయంత్రం వెళ్లాడు. తనవెంట తీసుకెళ్లిన పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రాత్రి అయినా రామకృష్ణ ఇంటికి రాకపోవటంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి వెతికారు. పురుగుల మందు తాగినట్లుగా గుర్తించి వెంటనే స్థానికంగా ఉన్న ప్రైవేట్ వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అందించారు. పరిస్థితి విషమించటంతో ఆదివారం ఉదయం అతడు మృతి చెందాడు. రామకృష్ణకు భార్య మల్లీశ్వరి, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సి. భాస్కర్ తెలిపారు.

లారీ ఢీకొని ద్విచక్ర వాహన చోదకుడి మృతి



ప్రమాదస్థలిలో వీర శంకు మృతదేహం

మేడికొండూరు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మేడికొండూరు గ్రామ శివారులో ఆదివారం జరిగింది. మేడికొండూరు సీఐ నాగుల్ మీరా సాహెబ్ తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం ఎమ్మాజీ గూడెం గ్రామానికి చెందిన ఓర్చు వీర శంకు (19) ఆదివారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై గుంటూరు వెళ్తున్నాడు. మార్గమధ్యలో మేడికొండూరు ఈద్గా సమీపం వద్ద గుంటూరు – సత్తెనపల్లి వైపు వెళ్తున్న లారీ వీర శంకు ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. డ్రైవర్ అజాగ్రత్త కారణంగానే ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు.

ఈశా గ్రామోత్సవం రాష్ట్ర స్థాయి పోటీలు



విజేతలతో ఫుడ్ బ్లాగర్ శైలజ ఏచూరి తదితరులు

ఏఎన్‌యూ: ఈశా గ్రామోత్సవం రాష్ట్ర స్థాయి పోటీలు ఆదివారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లోని 13 ఉమ్మడి జిల్లా స్థాయిల్లో నిర్వహించిన పోటీల విన్నర్స్, రన్నర్స్ ఈ పోటీలలో పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 260 మంది పురుషులతో కూడిన 26 వాలీబాల్ జట్లు, 180 మంది మహిళా క్రీడాకారిణులతో కూడిన 18 త్రోబాల్ జట్లు ఈ పోటీలలో పాల్గొన్నాయి. తెలుగు గాయని స్ఫూర్తి జితేంద్ర గాన మాధుర్యంతో ప్రేక్షకులను అలరించారు. సినీ నటుడు అంకిత్ కొయ్య అతిథిగా విచ్చేసి ఆటగాళ్లను ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమానికి ఫుడ్ బ్లాగర్ శైలజ ఏచూరి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. గెలిచిన టీంలకు ముగింపు కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేశారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ముఖ్య అతిథిగా, డాక్టర్ ప్రమోద్ (లతా హాస్పిటల్స్) రావి రమేష్ (అమరావతి రన్నర్స్) గౌరవ అతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మహిళల త్రోబాల్ పోటీల్లో వైజాగ్‌కి చెందిన నేల్తురు జట్టు మొదటి స్థానాన్ని పొందగా, రెండవ స్థానంలో ఇచ్ఛాపూర్ (వైజాగ్) నిలిచింది. కాకినాడ ఇన్‌స్పిరేషన్ టీం ఇంకా సెయింట్ ఆన్స్ బొమ్మూరు మహేశ్వరి టీం (ఈస్ట్ గోదావరి) తదుపరి స్థానాలను కైవసం చేసుకున్నాయి.

పురుషుల వాలీబాల్ పోటీల్లో ఈస్ట్ గోదావరి జిల్లా ధర్మవరం నవతా యూత్ జట్టు మొదటి స్థానం కైవసం చేసుకుంది. జీపీఎంస్పైకర్స్ (నెల్లూరు), తరిమేల కింగ్స్ (అనంతపురం), సుప్రీమ్ స్పైకేర్స్ (ఏలూరు) తదుపరి స్థానాల్లో నిలిచాయి. 2004 నుండి ఈశా ఫౌండేషన్ నిర్వహిస్తున్న గ్రామీణ క్రీడోత్సవమే ఈశా గ్రామోత్సవం. క్రీడలను గ్రామీణుల జీవితంలో ఒక భాగంగా మార్చి తద్వారా వారి ఆరోగ్యాన్ని, శ్రేయస్సుని పెంపొందించడమే దీని ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల విజేతలకు ఫైనల్స్ పోటీలు కోయంబత్తూరులోని ఈశా యోగా సెంటర్‌లో నిర్వహిస్తారు.



త్రోబాల్ ఆడుతున్న ఫుడ్ బ్లాగర్ శైలజ ఏచూరి



వాలీబాల్ ఆడుతున్న సినీ నటుడు అంకిత్ కొయ్య

యూత్ గేమ్స్‌లో కోచ్ విన్నకోట టీంకు పతకాల పంట

ఈపురుపాలెం గ్రామ ప్రజల హర్షం



కోచ్ వేణు, క్రీడాకారులను అభినందిస్తున్న తెలంగాణ గవర్నర్

చీరాల టౌన్: అంతర్జాతీయ ఆటల పోటీల్లో పారా క్రీడాకారులు పతకాల పంట పండించారు. ప్రపంచ స్థాయి ఎబిలిటీ యూత్ గేమ్స్–2024 పోటీల్లో మాజీ అంతర్జాతీయ పారా క్రీడాకారుడు, కోచ్ విన్నకోట వేణు వద్ద శిక్షణ తీసుకుంటున్న దివ్యాంగ క్రీడాకారులు రాణించారు. అండర్–20లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, కర్ణాటక, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన దివ్యాంగ క్రీడాకారులు జవహర్ నవోదయ విద్యాలయం హైదరాబాద్‌లో చదువుతున్నారు. వీరికి మండలంలోని ఈపురుపాలేనికి చెందిన అంతర్జాతీయ పారా ఒలంపిక్ క్రీడాకారుడు షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్ త్రో, లాంగ్‌జంప్, తదితర విభాగాల్లో శిక్షణ అందిస్తున్నాడు. థాయిలాండ్‌లో జరిగిన యూత్ గేమ్స్ 2024లో తన వద్ద శిక్షణ పొందుతున్న క్రీడాకారులు 14 పతకాలు సాధించి ఇండియాకు మంచి పేరు తీసుకువచ్చారన్నారు. యూత్ గేమ్స్‌లో గోల్డ్ 5 పతకాలు, సిల్వర్ 6 పతకాలు, బ్రాంజ్ 3 పతకాలు సాధించడంతో తెలంగాణా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆదివారం తెలంగాణా రాజ్ భవన్‌లో ప్రతిభచూపి పతకాలు సాధించిన దివ్యాంగ క్రీడాకారులతో పాటుగా శిక్షణ అందించిన కోచ్ వేణును సత్కరించి అభినందించారు. దివ్యాంగ క్రీడాకారులకు క్లిష్టమైన డిస్కస్ త్రో, జావెలిన్ త్రో, లాంగ్ జంప్, షాట్‌పుట్‌లో శిక్షణ అందిస్తు మెరికల్లా తయారుచేస్తున్న కోచ్ వేణును తెలంగాణా గవర్నర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈపురుపాలేనికి చెందిన విన్నకోట వేణు బృందానికి ప్రపంచ యూత్ గేమ్స్‌లో పతకాల పంట పండించడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన వేణు స్నేహితులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

పాలకుల నిర్లక్ష్యంతోనే

పల్నాడు వెనుకబాటుతనం

- సీపీఎం జిల్లా మహాసభలో ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు
- వరికపూడిశెల ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయించాలి
- ప్రచార ఆర్భాటానికే పరిమితం అవుతున్న కేంద్ర, రాష్ట్ర పథకాలు
- పలు తీర్మానాలు ఆమోదం



జిల్లా నూతన కార్యవర్గ నాయకులు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

నరసరావుపేట: పాలకుల నిర్లక్ష్యం వలనే పల్నాడు జిల్లా అన్ని విధాలుగా వెనుకబాటుతనానికి గురైందని పీడీఎఫ్ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు పేర్కొన్నారు. సీపీఎం పల్నాడు జిల్లా మహాసభలు ఆదివారం ముగిశాయి. పట్టణంలోని ప్రకాష్‌నగర్ షాదీఖానాలో నిర్వహించిన సమావేశానికి డి.విమల, ఎస్.ఆంజనేయనాయక్, టి.హనుమంతరావు అధ్యక్షత వర్గంగా వ్యవహరించారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, కె.హరికిషోర్ హాజరయ్యారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ జిల్లాలో అక్షరాస్యత 60శాతం ఉంటే పల్నాడు ప్రాంతమైన పది మండలాలలో 56 శాతం అక్షరాస్యత ఉండడం బాధాకరమన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1000 మంది విద్యార్థులు ఉన్న జెడ్పీహెచ్‌ఎస్‌లు పల్నాడులో మినహా మరెక్కడా లేవన్నారు. అయినా పల్నాడులో ఉపాధ్యాయుల కొరత ఉండడం ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని ధ్వజమెత్తారు. 2010లో అప్పటి ముఖ్యమంత్రి కె.రోశయ్య మాచర్ల ప్రాంతంలో మిర్చి యార్డు నిర్మాణానికి, యడ్లపాడు టెక్స్ టైల్ పార్క్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారని శిలాఫలకాలు శిథిలావస్థకు చేరినా వాటి ఊసేలేదని పేర్కొన్నారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అనువైన భూములు, వనరులు పుష్కలంగా ఉన్నాయని, ఇటువంటి పరిస్థితులలో మిర్చి ఎక్స్‌పోర్టుజోన్, విమానాశ్రయం, ఫార్మాస్యూటికల్స్ హబ్, ఎలక్ట్రానిక్స్, ఐటీ పరిశ్రమల ఏర్పాటు, ప్రతి నియోజకవర్గంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జిల్లా కేంద్రంలో పీజీ సెంటర్ ఏర్పాటు, వరికపూడిశెల ఎత్తిపోతల పథకం పూర్తి చేయడం ద్వారా జిల్లా సమగ్రాభివృద్ధి సాధ్యపడుతుందని వివరించారు. బీజేపీని ఎదుర్కొనే శక్తి, చిత్తశుద్ధి, రాజకీయ పంథా ప్రధాన పార్టీలకు లేదని విమర్శించారు. పల్నాడు అభివృద్ధికి పలు తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

పల్నాడు జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవం

జిల్లా కార్యదర్శిగా గుంటూరు విజయ్‌కుమార్, కార్యదర్శివర్గ సభ్యులుగా వై.రాధాకృష్ణ, ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, ఎస్.ఆంజనేయులునాయక్, ఏపూరి గోపాలరావు, జి.రవిబాబు తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ సభ్యులుగా డి.శివకుమారి, డి.విమల, జి.మల్లేశ్వరి, జి.బాలకృష్ణతో పాటు పలువురిని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది.